మంత్రి అమర్నాథ్‌కు అరుదైన గౌరవం

మినిస్టర్ ఇన్ వెయిటింగ్ హోదా

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు అరుదైన గౌరవం లభించింది. ఈనెల 4వ తేదీన భారత రాష్ట్రపతి ముర్ము విశాఖ నగరానికి రానున్నారు. నాలుగో తేదీన విశాఖలో జరగనున్న నేవీ డేకి ఆమె ముఖ్యఅతిథిగా హాజరవుతున్న సంగతి తెలిసిందే. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విశాఖ నగరానికి వచ్చినప్పటి నుంచి తిరిగి వెళ్లేంతవరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు ఆమె వెంట ఉంటారు. సాధారణంగా రాష్ట్రపతికి గవర్నర్, ముఖ్యమంత్రి విమానాశ్రయంలో స్వాగతం పలకాల్సి ఉంటుంది. అయితే రాష్ట్రపతి ఢిల్లీ నుంచి నేరుగా విజయవాడ వస్తారు. అక్కడే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రపతికి స్వాగతం పలుకుతారు. దీంతో విశాఖలో జరిగే రాష్ట్రపతి కార్యక్రమాలను పర్యవేక్షించే బాధ్యతలను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. మినిస్టర్ ఇన్ వెయిటింగ్ హోదా కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. విశాఖ విమానా శ్రయంలో రాష్ట్రపతికి స్వాగతం పలికే దగ్గర నుంచి, విశాఖ నుంచి రాష్ట్రపతి తిరిగి వెళ్లేంత వరకు ముఖ్యమంత్రి స్థానంలో ప్రభుత్వ ప్రతినిధిగా అమర్నాథ్ వ్యవహరించనున్నారు. నేవీ డేలో కూడా రాష్ట్రపతితో పాటు మంత్రి అమర్నాథ్ దంపతులు పాల్గొంటారు.

త్వరలోనే జెడ్పీ షాపింగ్ నిర్మాణం

విశాలాంధ్ర - సింహాచలం: గ్రేటర్ విశాఖ 89వ వార్డ్ పరిధిలో పాత గోశాల ప్రాంతంలో విశాఖ జిల్లా పరిషత్ డిప్యూటీ సి.ఇ.ఓ సత్యనారాయణ బృందం బి.ఆర్.టి.ఎస్ రోడ్‌లో జెడ్పీ షాపింగ్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ఈ ప్రదేశంలో త్వరలోనే షాపింగ్ కాంప్లెక్స్ లేదా గెస్ట్ హౌస్ నిర్మాణం చేపడతామని అన్నారు. అదేవిధంగా సింహాచలం రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న తమ డిపార్ట్మెంట్ స్థలాన్ని (పాడుబడ్డ భవనం) పరిలించామని అన్నారు. జీవీఎంసీ కమిషనర్‌తో మాట్లాడి టీడీఆర్‌ను తీసుకుని సమగ్ర సర్వే చేసి ప్లాన్ ప్రకారం నిర్మాణం ప్రారంభిస్తామని అన్నారు.

విశాఖ సముద్ర చరిత్ర గొప్పది

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ ఎన్.ఎస్.టి.ఎల్ లో మెరైన్ ఇంజనీర్ల మెరైన్ ఇంజనీర్ల 34వ జాతీయ సమావేశం ప్రారంభమైంది. పలువురు ప్రముఖులు మాట్లాడుతూ విశాఖపట్నం గొప్ప సముద్ర చరిత్రను కలిగివుందని అన్నారు. ఎన్.ఎస్.టి.ఎల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు నిఘా, తీర రేఖ భద్రత, తీరప్రాంత సముద్ర కాలుష్యం తగ్గించే పద్ధతులపై సూచనలు చేశారు. ప్రపంచంలోనే విశాఖ సముద్ర చరిత్ర గొప్పదని అన్నారు.

జుత్తాడ హైస్కూలు సందర్శించిన ఎంపీపీ

విశాలాంధ్ర - పెందుర్తి: మండలంలోని వాలిమెరక జుత్తాడ అంగన్వాడీ కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపీపీ మధుపాడ నాగమణి అంజి శుక్రవారం సందర్శించారు. ఆర్డీఓ, స్పెషల్ ఆఫీసర్, తహశీల్దార్, ఎంపీడీఓ, ఏటీఎం, ఈఓపీఆర్డీ తదితర అధికార బృందంతో కలిసి పిల్లల అటెండన్స్ రికార్డులను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకంలో లోటుపాట్లని తెలుసుకోవడం కోసం అక్కడి విద్యార్థులతో కలిసి భోజనం చేసి నాణ్యతను పరిశీలించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు భవాని

విశాలాంధ్ర - నాతవరం: త్రోబాల్ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థిని పెదనాపల్లి జ్వాలాదుర్గా భవానిని ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. గునుపూడి హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న భవాని అండర్-17లో త్రోబాల్ పోటీలలో రాష్ట్ర స్థాయికి ఎంపికైందని హైస్కూల్ హెచ్‌ఎం ఎల్‌సిహెచ్.పాత్రుడు తెలిపారు. విద్యార్థినితో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు నాగరాజును సర్పంచ్ వేముల సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు పోలువర్తి వెంకటరమణ, విద్యా కమిటీ చైర్మన్ పి.శ్రీనివాసరావు, సీఆర్పీ పోలువర్తి నాగేశ్వరరావు సత్కరించారు.

సబ్సిడీపై విత్తనాలు పంపిణీ

విశాలాంధ్ర - దేవరాపల్లి: మండలంలో రబీ సీజన్‌కు ప్రభుత్వం అందించే సబ్సిడీ వేరుశనగ విత్తనాలను శుక్రవారం ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారిణి వై.కాంతమ్మ మాట్లాడుతూ వేరుశెనగ బస్తా రూ.2574 కాగా 40% సబ్సిడీ పోను రూ.1545 రైతు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు మొల్లి కృష్ణమూర్తి, ఎ.కొత్తపల్లి సర్పంచ్ చింత సత్య వెంకటరమణ, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ వరదపురెడ్డి సింహాచలంనాయుడు, చల్లా తాతయ్యలు, మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారి ఎస్.కిరణ్ కుమార్, అగ్రికల్చర్ అసిస్టెంట్ సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

అగ్నికి ఆహుతైన పూరిల్లు

విశాలాంధ్ర - భీమునిపట్నం: భీమిలి జోన్ 3వ వార్డు గొల్లవీధిలో శుక్రవారం పట్టపగలు వెంపాడ పద్మకు చెందిన పూరిల్లు అగ్నికి ఆహుతైంది. ఈ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కురుపాం నియోజకవర్గం పరిశీలకులు గంటా నూకరాజు అధికారులకు విజ్ఞప్తి చేశారు. వెంపాడ పద్మ ఇంట్లో డింగి అప్పలనర్సమ్మ వాళ్ళ అబ్బాయి ఎర్రయ్య రెడ్డి అద్దెకు ఉంటున్నారు. ఎర్రయ్య రెడ్డి భవాని మాలధారణ ధరించడంతో ఇంట్లో జ్యోతి వెలిగించి నిత్యం పూజలు చేస్తుంటారు. వెలిగించిన జ్యోతి పెద్దదై పూజా సామాగ్రికి నిప్పు అంటుకోవడంతో ఇల్లంతా అగ్నికి ఆహుతైంది. టీడీపీ నాయకులు డింగి సత్యనారాయణ, స్థానిక యువత సహాయంతో ఫైర్ ఇంజన్ ద్వారా మంటలు ఆర్పారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, మారోజు సంజీవకుమార్‌లు బాధితులను పరామర్శించారు. తహశీల్దార్ నివేదిక తీసుకున్నారు.

వ్యక్తి దారుణ హత్య

విశాలాంధ్ర - పాయకరావుపేట: పట్టణంలోని అంబేద్కర్ కాలనీలో వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. సీఐ అప్పలరాజు అందించిన వివరాల ప్రకారం అంబేద్కర్ కాలనీకి చెందిన చిలుకూరి చిన్న అప్పారావు (47) వీధుల్లో తిరుగుతూ చిత్తు కాగితాలు ఏరుకుంటూ వాటిని అమ్ముకొని జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. అయితే అప్పారావు ఇంటి సమీపంలో ఒక గదిలో గురువారం రాత్రి హత్యకు గురైనట్లు తెలిపారు. తల వెనుక భాగంలో తీవ్ర గాయం ఏర్పడి, తీవ్ర రక్తస్రావం అయినట్టు తెలిపారు. మృతదేహం పక్కనే పెద్ద రాయి ఉందని, నిద్రపోతుండగా గుర్తు తెలియని వ్యక్తులు అప్పారావు తలపై పెద్ద రాయితో కొట్టి చంపినట్లుగా భావిస్తున్నట్టు తెలిపారు. మృతుడు కుమార్తె ఇంజరపు శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహానికి శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని సిఐ అప్పలరాజు తెలిపారు. హత్యకు గురైన చిన్న అప్పారావు మృతదేహాన్ని, పరిసరాలను డీఎస్పీ ప్రవీణ్ కుమార్ పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ తీసుకొచ్చి సంఘటన జరిగిన ప్రాంతంలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు డిఎస్పి ప్రవీణ్ కుమార్ తెలిపారు.

'ఇదేం ఖర్మ రాష్ట్రానికి' పోస్టర్ విడుదల

విశాలాంధ్ర - యలమంచిలి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు వివరించేందుకు 'ఇదేం ఖర్మ.. మన రాష్ట్రానికి' అన్న నినాదంతో 45 రోజుల పాటు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు సీనియర్ టీడీపీ నాయకులు, మాజీ పార్లమెంట్ సభ్యులు పప్పల చలపతిరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణంలో గోడ పత్రికను ఆవిష్కరించి ర్యాలీ చేశారు. పార్టీ నియోజ కవర్గ ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు, కార్యకర్తలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు రాజాన రమేష్, దూళి రంగ నాయకులు, టౌన్ అధ్యక్షులు గొర్లె నానాజీ, రాష్ట్ర తెలుగు మహిళా కార్యవర్గ సభ్యులు కె.అనురాధ, టీడీపీ సీనియర్ నాయకులు అన్నం వెంకట్రావ్, ఆదిమూర్తి, కౌన్సిలర్ ఎమ్.రామకృష్ణ, జిల్లా తెలుగు యువత కార్యదర్శి జి.శేషు, టౌన్ కార్యదర్శి రమణబాబు పాల్గొన్నారు.

17న శ్రీనివాసుని కల్యాణం

విశాలాంధ్ర - అనకాపల్లి: సకలజనుల శ్రేయస్సు కోసం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని సంకల్పంతో ప్రముఖ పారిశ్రామికవేత్త, సంఘ సేవకులు ముత్యాల వెంకటేశ్వరరావు, సూర్య కుమారి దంపతులు అత్యంత వైభవంగా ఈనెల 17న శ్రీనివాసుని కల్యాణం చేయదానికి సంకల్పించినట్లు వారి తనయుడు సంజయ్ తెలిపారు. శుక్రవారం స్థానిక విజయ రెసిడెన్సి హోటల్లో జరిగిన సమావేశంలో శ్రీనివాసుని కళ్యాణానికి సంబం ధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రముఖ పారిశ్రామిక వేత్త ముత్యాల గార్మెంట్స్ అధినేత ముత్యాలవెంకటేశ్వరరావు, సూర్యకుమారి దంపతులతో ఈ నెల 17 శనివారం సాయంత్రం 6 గంటల నుండి నరసింగరావుపేటలో గల తమ స్వగృహంలో వెంకటేశ్వర కళ్యాణాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. లోక కల్యాణార్థం జరపబడుతున్న ఈ కళ్యా ణానికి ప్రముఖులు విచ్చే స్తున్నారని అందులో వివిధ రాష్ట్రాల నుండి రాజకీయ ప్రముఖులు, వ్యాపారవేత్తలు, ప్రముఖ సినీ తారలు ఉన్నారన్నారు. వివిధ ప్రాంతాల నుండి ప్రజలు భారీగా తరలి రావడానికి వారికి రవాణా సౌకర్యం కూడా కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్ర మాన్ని ప్రతి ఒక్కరు కనులారా వీక్షించి ఆ శ్రీనివాసని కృపా కటాక్షాలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేగి వెంకట్రావు, నాయుడు, గిరిబాబు కరణం శ్రీనివాసరావు (చెక్కల) ప్రణీత, పద్మావతి ఎంవీఆర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేలలో సిబ్బంది నియామకం

విశాలాంధ్ర - జికెవీధి: జికెవీధి మండలం దామనపల్లి, గాలికొండ రైతు భరోసా కేంద్రాల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్లు లేకపోవడంతో ప్రజల అభ్యర్థన మేరకు జికెవీధి మండలంలో పని చేస్తున్న ఎంపీఈఓలను వ్యవసాయా ధికారి విన్నపం మేరకు సహాయ వ్యవసాయ సంచాలకులు దామనపల్లి రైతు భరోసాకు పి.జోసెఫ్‌ను, గాలికొండ (సప్పర్ల) రైతు భరోసా కేంద్రానికి పి.గణేష్‌ను డిప్యూటేషన్‌పై నియమించడం జరిగిందని మండల వ్యవసాయా ధికారి మధుసూధనరావు తెలిపారు.

ప్రజాసంక్షేమానికి సీఎం పెద్దపీట

ఎమ్మెల్యే ముత్తంశెట్టి

విశాలాంధ్ర - కొమ్మాది: పేదవాడి సంక్షేమమే నాందిగా దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి పాలనసాగుతోందని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 7వ వార్డు టైలర్స్ కాలనీ, శ్యామ్ నగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు గడపలను సందర్శించి పథకాలపై ఆరా తీశారు. వార్డులో ప్రజలకు పథకాలు చేర వేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ జోన్-2 కమిషనర్ బొడ్డేపల్లి రాము, 5వ వార్డ్ మాజీ కార్పొరేటర్ హనుమంతరావు, పోతిన మూర్తిబాబు, బంగారు ప్రకాష్, పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, అల్లాడ లింగేశ్వరరావు, పిల్లా సూరిబాబు, నగర కార్పొరేషన్ డైరెక్టర్ కురిటి లోహిత్, 7వ వార్డు అధ్యక్షురాలు చేకూరి రజిని, తమ్మినేని వరలక్ష్మి, జే.ఎస్.రెడ్డి, వసుపులేటి గోపి, పందిరి ఆదిలక్ష్మి, ఉగ్గిన నాగరాజు, మీసాల అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

5న జోనల్ కార్యాలయాల వద్ద నిరసనలు

సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు

విశాలాంధ్ర - విశాఖ: జగనన్న కాలనీ లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వమే రూ. 5 లక్షలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం తగరపువలస సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పూర్తిగా తయారైన టిడ్కో ఇళ్లను తక్షణమే లబ్ధిదారులకు స్వాధీనం చేయాలన్నారు. 5వ తేదీన లబ్ధిదారులచే జీవీఎంసీ జోనల్ కమిషనర్‌లకు వినతిపత్రాలు సమర్పించాలని చెప్పారు. రాష్ట్ర వ్యాపితంగా రూ.700 కోట్లు ఖర్చుతో 34 లక్షలు మందికి ఇంటి పట్టాలు మంజూరు చేసిన జగనన్న కాలనీల్లో ఇప్పటికీ చాలా చోట్ల నిర్మాణాలు ప్రారంభం కాలేదని చెప్పారు. దీనికి కారణం పట్టణానికి దూరంగా స్థలాలు మంజూరు చెయ్యడం ఒక కారణమైతే, ఇంటి నిర్మాణ ఖర్చులు బాగా పెరగడం, ప్రభుత్వం ఇస్తున్న 250 కేజీల ఉక్కు, 90 బస్తాలు సిమెంట్, ఇటుక సరిపోవని, కనీసం 1500 కేజీల ఉక్కు, 300 సిమెంట్ బస్తాలు, నాలుగు వేలు ఇటుకలు అవసరం అవుతాయని అన్నారు. నిపుణులు అంచనా ప్రకారం రూ.ఎనిమిది లక్షలు ఖర్చు అవుతుందని, ప్రభుత్వం మంజూరు చేసిన లక్షా ఎనభై వేలు ఏమాత్రం చాలక నిర్మాణాలు ప్రారంభం కాలేదని అన్నారు. ఈ నెల 5వ తేదీన ఈ రెండు డిమాండ్స్‌పై లబ్ధిదారులతో కలిసి జీవీఎంసీ పరిధిలో జోనల్ కమిషనర్లకు సిపిఐ ఆధ్వర్యంలో వినతిపత్రాలు ఇస్తామని, లబ్ధిదారులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. నూలు ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఐ నాయకులు అల్లు బాబురావు, కానూరి రాంబాబు, చిల్ల అప్పలసూరి, శరగడ ఈశ్వరరావు, జల్లు సూర్యనారాయణ, అల్లం గోవిందరావు, రంగూరి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాకరలోవలో డీహెచ్‌పీఎస్ నిరసన

విశాలాంధ్ర - మల్కాపురం: ఆంధ్రప్రదేశ్ దళిత హక్కుల పోరాట సమితి విశాఖ జిల్లా ఆధ్వర్యంలో 63వ వార్డు కాకరలోవ గ్రామంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం జిల్లా కార్యదర్శి గుడాల రాంబాబు మాట్లాడుతూ ప్రైవేట్ రంగాలలో రిజర్వేషన్ అమలు చేయాలని, దళితుల సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. దళితవాడలో సరైన రోడ్లు లేక సరైన బోరింగు సదుపాయాలు లేక మినీ ఆసుపత్రులు లేక దళిత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ సమస్యలపై 2022 డిసెంబర్ 6వ తేదీన విజయవాడలో సదస్సు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ నాయకులు కామేశ్వరరావు, కనకేశ్వరరావు, వెంకట్, శ్రీరామ్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మోదకొండమ్మ గుడి నుండి రామచంద్రపురం వైపు వెళ్లే రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ పెదబాబు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. 1800 మీటర్ల నిర్మాణ పనులకు మంత్రి బూడి ముత్యాలనాయుడు నిధులను మంజూరు చేసి మాడుగుల ప్రాంతాన్ని అంచెలంచెలుగా అభివృద్ధి చేస్తున్నారని ఇప్పటికే ఇంటింటికి కొళాయిలు ఇచ్చామని నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెదబాబు, సర్పంచ్ యడ్ల కళావతి, ఉప సర్పంచ్ శ్రీనాధు శ్రీనువాసరావు, వైసీపీ పట్టణ అధ్యక్షులు బొమ్మిశెట్టి శ్రీనువాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర - యలమంచిలి: పట్టణ మున్సిపాలిటీ పరిధి సోమలింగపాలెం గ్రామంలో శుక్రవారం నియోజకవర్గ ఎమ్మెల్యే యూ.వి.రమణమూర్తి రాజు (కన్నబాబు) ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతీ ఒక్క ఇంటికి వెళ్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిసిబి చైర్మన్ సుకుమార్ వర్మ, మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి, ఎమ్మార్వో రాణిఅమ్మాజీ, ఎంపిడిఓ ప్రసాద్, ఎంపీపీ గోవింద్, మున్సిపల్ వైస్ చైర్మన్లు నాగేశ్వరరావు, గుప్తా, కౌన్సిలర్లు కర్రి లక్ష్మీ, సత్తిబాబు, వెంకట్,వైసిపి పట్టణ,మండల అధ్యక్షులు బి.ఎర్రయ్య దొర, కె.త్రినాథ్, వైసీపీ సీనియర్ నాయకులు కర్రి శివ, సేనాపతి రాము పాల్గొన్నారు.

వీఆర్వోల నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం వీఆర్వోల నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఎన్నికల్లో నూతన అధ్యక్షుడిగా టి.ఉమామహేశ్వరరావు, కార్యదర్శిగా కే.మల్లన్న దొర, సంయుక్త కార్యదర్శిగా ఎంపీ సుమలత, కోశాధికారిగా పి.రవికుమార్, కార్యవర్గ సభ్యులుగా కేకే రత్నం, గీతలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

33వ రోజుకు చేరుకున్న ఆందోళనలు

విశాలాంధ్ర - రాంబిల్లి/యలమంచిలి: నేవి గేటు ముందు 8 వేల మంది తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం చేస్తున్న ఆందో ళనలు శుక్రవారం నాటికి 33వ రోజుకు చేరుకున్నాయి. ఇన్ని రోజుల నుంచి తమ ఉపాధిని కూడా వదులుకుని ఆందోళనలు చేపడుతున్నప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. వారి డిమాండ్లను పరిష్కరించేవరకు ఆందోళనలు విరమించేటట్టు లేనట్టుగానే ఉండటం ఒకెత్తయితే దానితో పాటుగా పలు రాజకీయ పార్టీ నాయకుల మద్దతులు తెలియజేయడం వీళ్ళ ఆందోళనలకు మరింత బలాన్ని చేకూరుస్తున్నాయని పలువురు అభిప్రాయపడ్డారు.

ఆర్ఎంపీల సంఘం జిల్లా సహాయ కార్యదర్శిగా జి.బి.రాజు

విశాలాంధ్ర - ఆనందపురం: గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శిగా జి.బి.రాజు నియమితులయ్యారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు నూతన సహాయ కార్యదర్శి జి.బి.రాజుకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జీబీ రాజు మాట్లాడుతూ పేద ప్రజలకు నాణ్యమైన, ఉన్నతమైన చికిత్సను అందించి ఎల్లప్పుడూ రోగులకు అందుబాటులో ఉంటానని తెలియజేశారు. ఈ మేరకు జంగం జోషి , మహిళా అధ్యక్షురాలు సుగుణేశ్వరి, ఆకుల శ్రీనివాస్, మమ్ముల తిరుపతిరావు, కార్యదర్శి నారాయణరావులకు కృతజ్ఞతలు తెలిపారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం: డాక్టర్ కూటికుప్పల

విశాలాంధ్ర - విశాఖ: పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఆవకాశం ఉందని ప్రముఖ వైద్యులు, కవి, పద్మశ్రీ కూటికుప్పల సూర్యారావు ఉద్ఘాటించారు. విశాలాంధ్ర 21వ విశాఖ పుస్తక మహోత్సవాన్ని కూటికుప్పల సూర్యారావు శుక్రవారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాలాంధ్ర ప్రచురణాలయం అనేక దశాబ్దాలుగా సాహిత్య విస్తరణకు విశేష కృషి చేస్తోందని, ప్రస్తుత కంప్యూటర్ యుగంలో కూడా పుస్తక పఠనానికి ఆదరణ తగ్గలేదని ఈ ప్రదర్శన చూస్తే తెలుస్తోందని అన్నారు. పుస్తకాలు మంచి స్నేహితులతో సమానమని పేర్కొన్నారు. ఎన్నో వ్యయ ప్రయాసలతో వేలాది రకాల పుస్తకాలు ఒకే వేదిక పైకీ తీసుకు వచ్చిన విశాలాంధ్ర యాజమాన్యాన్ని ప్రత్యేకం గా ఆయన అభినందించారు. పుస్తక పఠనం యొక్క విశిష్టతను పద్యరూపంలో వివరించారు. పిల్లలకు చిన్నప్పుడు నుంచే పుస్తక పఠనం పట్ల మక్కువ కలిగించాలని తల్లిదండ్రులకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అరసం రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, ఆలిండియా రేడియో సీనియర్ వ్యాఖ్యత బండి సత్యనారాయణ, బుక్ హౌస్ మేనేజర్ పిఎ రాజు, సిబ్బంది మూర్తి, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణ పోరులో భాగస్వాములు కావాలి

విశాలాంధ్ర - గాజువాక: ఉక్కు పరిరక్షణ పోరులో ప్రజా ప్రతినిధులు భాగస్వామ్యం అవసరం ఉందని టీఎన్టీయూసీ రాష్ట్ర ప్రతినిధుల సమావేశం విజ్ఞప్తి చేసింది. విజయవాడలో జరిగిన నేషనల్ టీఎన్‌టీయూసీ ప్రతినిధులు సమావేశంలో రాష్ట్ర పూర్వపు టీఎన్‌టీయూసీ అధ్యక్షులు ఆర్.రామ్ మోహన్‌రావు, అధ్యక్షులు చాగంటి నరసింహరావు, గౌరవ అధ్యక్షులు జి.శేష గిరిరావు, సెక్రటరీ జనరల్ జేవీ నరసింహ మూర్తి, ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు, వైస్ చైర్మన్ పాండురంగ జయ రాజు, నారా జోషి తదితరులు పాల్గొన్నారని స్థానిక యూనియన్ కార్యాలయం తెలిపింది. ఇతర రాష్ట్రాల నుంచి వివిధ ప్రతినిధులు కరణం సత్యారావు, సేతుపతి రమేష్, ఎంకె రెడ్డి, ఎం.ప్రకాష్ యాదవ్, రాజు రవీంద్ర పాశ్వాన్ పాల్గొన్నారని కార్యాలయం ఆ ప్రకటనలో పేర్కొంది. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణ కోసం కేంద్రం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే కార్యక్రమంతో పాటు ప్రజా ప్రతినిధులు ప్రత్యక్ష పోరాటానికి సిద్ధం కావాలని విజ్ఞప్తి చేశారు.

వైసీపీ హయాంలో ప్రజలకు అన్ని సమస్యలే

టీడీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత

విశాలాంధ్ర - యస్.రాయవరం: వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు అన్ని సమస్యలే అని టీడీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత అన్నారు. శుక్రవారం మండల కేంద్రం యస్.రాయవరం గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వీధుల్లో తిరు గుతున్న ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత సామాన్య వ్యక్తులు ఏమీ కొనుగోళ్లు చేయలేని పరిస్థితి నెలకొం దని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, మండల టీడీపీ అధ్యక్షులు అమలకంటి అబద్ధం, సీనియర్ నాయకులు ఎన్.వెంకటరాజు, కందుల వెంకటేశ్వరరావు, తుమ్మపాల నాగేశ్వరరావు, కొప్పిశెట్టి వెంకటేష్, జానకి శ్రీను, గుర్రం రామకృష్ణ, అల్లు నరసింహమూర్తి, ఐటిడిపి జిల్లా అధ్యక్షుడు భీమరశెట్టి శ్రీనివాసరావు, స్థానిక నాయకులు బత్తుల సోమయ్య, సోమిరెడ్డి రాజు, పోతు అర్జున్ పాల్గొన్నారు.

రూ.2.76 లక్షలతో కాఫీ కొనుగోలు ప్రధాన లక్ష్యం

జీసీసీ మేనేజర్ వెంకటేష్

విశాలాంధ్ర - అరకులోయ: గిరిజన సహకార సంస్థ అరకులోయ ప్రధాన బ్రాంచి పరిధిలో 2022-2023 ఆర్థిక సంవత్సరంలో 134 టన్నుల కాఫీని కొనుగోలు చేసి, రెండు కోట్ల 76 లక్షల వ్యయంతో కొనుగోలు చేయాలని నిర్ణయించుకున్నట్లు ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నామని గిరిజన సహకార సంస్థ బ్రాంచి మేనేజర్ బుక్క వెంకటేష్ స్పష్టం చేశారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ సీజన్లో వివిధ రకాల కాఫీ కొనుగోలుపై జీసీసీ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుందని తెలిపారు. అరకులోయ, డుంబ్రిగూడ మండలాల పరిధిలో కాఫీ కొనుగోలు కేంద్రాల వద్ద తాము నియమించబడ్డ జిసిసి సిబ్బంది కాఫీ పిక్కలను కొనుగోలు చేస్తారని ఆయన తెలియజేశారు. విశాఖ ఏజెన్సీ ప్రాంతంలో సాగులో ఉన్న పార్చి మెంట్ , చెర్రీ, రోబస్టా రకాల కాఫీ కొనుగోలుకు వివిధ ధరలను నిర్ణయించమన్నారు. పార్చ్మెంట్ కాఫీకి కిలోకి 270 రూపాయలు, చెర్రీకి కిలో 135, రోబస్టా 60 కొనుగోలు చేయాలని నిర్ణయించమన్నారు. లక్ష్య సాధనలో ఎప్పుడు జీసీసీ ముందుంటుందన్నారు.

ఏయూలో ఫుడ్ సైన్స్, టెక్నాలజీ కోర్సు ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఏయూలో నూతనంగా ప్రారంభిస్తున్న ఫుడ్ సైన్స్, టెక్నాలజీ కోర్సు శుక్రవారం ప్రారంభించారు. ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి మాట్లాడుతూ భారత్ ఐదు ట్రిలియన్ డాలర్ల ఎకానమిగా మారాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షిస్తున్నారని, యువత భాగస్వామ్యంతోనే ఇది సాధ్యపడుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అత్యంత ప్రాధాన్యత రంగాలుగా విద్య, ఆరోగ్యం నిలుస్తాయన్నారు. పారిశ్రామికవేత్తలను తయారు చేయడానికి ఈ రంగం ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. కొద్ది నెలల కాలంలో ఏయూలో ఫుడ్ ఇంక్యుబేషన్ సెంటర్‌ను నెలకొల్పడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏయూలో ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటుకు రూ 5 కోట్లు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

మధురవాడ జోన్‌లో బాబోయ్ పందుల బెడద

విశాలాంధ్ర - పీఎం పాలెం: విశాఖ నగరంలో పందుల గుంపులు స్వైర విహారం చేస్తున్నాయి. తాజాగా జీవీఎంసీ కమిషనర్ రాజబాబు ఆదేశాలు నేపథ్యంలో పలు ప్రాంతాల్లో పందుల్ని కాల్చివేస్తూ, మరికొన్ని పందులను నగరం దాటిస్తూ చేపడుతున్న చర్యలపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నప్పటికీ, మధురవాడ జోన్‌లో పందులు తాకిడి అధికంగా వుంది. ఆరో వార్డు పీఎం పాలెం అనేక వీధుల్లో ప్రధాన రహదారులపై పందులు స్వైర విహారం చేస్తుండడంతో ప్రజలకు తీవ్ర ఇక్కట్లు తప్పడం లేదు. సాంకేతిక ఇంజనీరింగ్ కాలేజీ సమీపంలో ఉన్న రత్నగిరి కాలనీలో అన్ని వీధుల్లో పందుల రాజ్యం నడుస్తోంది. పీఎం పాలెం ప్రాంతంలో ఉన్న శివారు ప్రాంతాల్లో మరింత అధికంగా పందుల తాకిడి ఉంది. బక్కన్నపాలెం, రేవల్లపాలెం, జేఎన్ఎన్‌యు ఆర్ఎమ్ హౌసింగ్ కాలనీల్లో మరింత పందుల బెడద అధికమైంది. కొమ్మాది మధురవాడ మార్కెట్ సమీపంలో ఉన్న స్వతంత్ర నగర్, గణేష్ నగర్, బొట్టవానిపాలెం, నగరం పాలెం, అయోధ్య నగర్, ఆర్టీసీ కాలనీ, వాంబే కాలనీ, శ్రీనివాస్ నగర్, మిథిలాపూర్ వుడా కాలనీ ఇలా మధురవాడ జోన్‌లో ఉన్న 5, 6, 7 వార్డుల్లో పందులు వేలాదిగా ఉన్నాయి. జోన్ 2 పరిధిలో అన్ని ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఎక్కడకక్కడ మురుగునీరు గుంతల గుంతలుగా నిలిచిపోవడంతో పందులు మరింత వాటిని రోడ్లపైకి జల్లి దోమల వ్యాప్తికి కారణమవుతున్నాయి. మధురవాడ జోన్లో ఉన్న మొత్తం పందుల నిర్మూలనకు నడుం బిగించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

రాజ్యాంగ స్ఫూర్తితో నడుస్తున్న ప్రభుత్వం మాది

విశాలాంధ్ర - అనకాపల్లి: మండలంలో కుంచంగి గ్రామంలో బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం

మంత్రి గుడివాడ అమర్నాథ్

మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తితో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నడుస్తోందని అన్నారు. మండలంలో సుందరయ్య పేటలో గడపగడపకు మనకు ప్రభుత్వం కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ పాల్గొని 23.34 లక్షల రూపాయలతో మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల నాడు నేడు పథకం క్రింద చేపడుతున్న పనులను ప్రారంభించారు. అదేవిధంగా ఎన్ ఆర్ డి డబ్ల్యు పి నిధులతో 10.30 లక్షలతో సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా పథకం కింద 20 కిలో లీటర్ల ఓవర్ హెడ్ ట్యాంకును మంత్రి అమర్నాథ్ ప్రారంభించారు. సుందరయ్య పేట ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మంత్రి అమర్నాథ్ ముచ్చటించారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, సుందరయ్య పేట సర్పంచ్ బాదపు ధనలక్ష్మి తాతారావు, వైస్ ప్రెసిడెంట్ బాదపు హరికృష్ణ, వైసీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు వీసీ స్థాయికి తగవు

సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు

విశాలాంధ్ర - విశాఖ : ఏయూ టీచింగ్ ఫ్యాకల్టీ, ఎం హెచ్ ఆర్ డీ కి చెందిన ఉన్నత భారత్ అభియాన్‌లో కో ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న పొన్నాడ శ్రీనివాసరావును వ్యక్తిగత కక్షతో ఉద్యోగం నుండి అక్రమంగా తొలగించడాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు తీవ్రంగా ఖండించారు. అతను నివసిస్తున్న ఏయూ క్వార్టర్ నెంబర్ 18కి ఎటువంటి ముందస్తు నోటీస్ ఇవ్వకుండా విద్యుత్, మంచినీటి కనెక్షన్లు తొలగించడం దుర్మార్గమని విమర్శించారు. ఉద్యోగం నుంచి తొలగింపుపై హై కోర్టు లో కేసు నడుస్తుండంగా ఇటువంటి చర్యలు తగవని అన్నారు. ఇంటిలో ఇద్దరు 5ఏళ్ల లోపు చిన్న పిల్లలు ఉన్నారని, అయినా అర్ధరాత్రి ఈ దారుణానికి పాల్పడటం హేయమైన చర్య అని, ఈ కక్ష సాధింపు చర్యలను విడనాడి వెంటనే డాక్టర్ శ్రీనివాసరావు ఇంటికి విద్యుత్, మంచినీటి కనెక్షన్లు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఏయూ వీసీగా ఇటువంటి అప్రజాస్వామ్య చర్యలకు పాల్పడడం స్థాయికి తగిన పని అని విమర్శించారు. శ్రీనివాస్‌ని పరామర్శించిన వారిలో ఏఐ ఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యు నాగరాజు, జి ఫణీంద్ర, జి నాయుడు తదితరులు ఉన్నారు.

సెయింట్ ఆన్స్ కళాశాలలో బ్లడ్ గ్రూప్ టెస్టింగ్ శిబిరం

విశాలాంధ్ర - మల్కాపురం: సెయింట్ ఆన్స్ కళాశాలలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న బ్లడ్ గ్రూపు టెస్టింగ్ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జానీస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ బ్లడ్ గ్రూపును తెలుసుకోవాలని అన్నారు. ఆపద సమయంలో ఇది ఎంతగానో తోడ్పడుతుందని ఆమె అన్నారు. సమావేశంలో గౌరవ అతిథిగా పాల్గొన్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి మాట్లాడుతూ బ్లడ్ గ్రూపింగ్ టెస్ట్ వల్ల విద్యార్థుల నైపుణ్యాలు పెరుగుతాయని, వారిలో శాస్త్రీయ అవగాహన ఏర్పడుతుందని అన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ అధ్యాపకులు నదియా, అంకిత, కళ్యాణి, ముంతాజ్, సువర్ణ తదితర అధ్యాపకులు పాల్గొన్నారు. క్యాంపులో భాగంగా 388 మంది తమ బ్లడ్ గ్రూపు వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ కళాశాల జాతీయ సేవా పథకం వాలంటీర్లు, విద్యార్థినులు, సెయింట్ జోసెఫ్ మరియు సరస్వతి స్కూలు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థులను ఎంతగానో ఆకర్షించింది. నిర్వాహకులను, పాల్గొన్న వారిని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి అభినందించారు.

పోలీసుల ముమ్మర తనిఖీలు

విశాలాంధ్ర - పెదబయలు: పెదబయలు మండల ఎస్సై పులి మనోజ్ కుమార్ సిపిఐ మావోయిస్టులు పార్టీ పి ఎల్ జి యఫ్ (పీపుల్స్ లిబరేషన్ గొరిల్లా,ఆర్మీ) వారోత్సవాలు కారణంగా విస్తృతంగా వాహనాలు తనిఖీ నిర్వహించారు. సరిహద్దుల్లో పోలీసు బలగాలు కూంబింగ్ ముమ్మరం చేశారు. పెదబయలు పోలీస్ స్టేషన్ సిఆర్పిఎఫ్ 198 కేంపియన్ ఏపీఎస్పీ పార్టీలతో ఎస్సై పులి మనోజ్ కుమార్ వాహనాల రాకపోకలపై నిఘా వుంచారు. ముఖ్యంగా మారుమూల నుంచి మండల కేంద్రాలకు వచ్చే వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రయాణికుల వివరాలు సేకరించారు. సంపంగి పుట్టు జంక్షన్, సీత గుంట జంక్షన్, భారత్ స్టేట్ బ్యాంక్ జంక్షన్, పన్నెడా జంక్షన్ వద్ద వాహనాలను తనిఖీ నిర్వహించారు,మునిడిపుట్టు జంక్షన్, పన్నెడ జంక్షన్, అరడకోట జంక్షన్‌లలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ వారోత్సవాల నేపథ్యంలో అధికార పార్టీ నేతలలో ఉన్నవారు మారుమూల పర్యటనలకు వెళ్లకూడదని ముందస్తుగా నోటీసులు జారీ చేస్తామన్నారు. సురక్షిత ప్రాంతాలలో ఉండాలని సూచించారు. మారుమూల ప్రాంతంలో రహదారి పనులకు సంబంధించిన ప్రొక్లెయినర్‌లు, జేసీబీలు, లారీలను సురక్షిత ప్రాంతాలలో తరలించారు. గత కొద్ది రోజులుగా సరిహద్దుల్లో మావోయిస్టుల కదలికలు అధికం కావడంతో ముందస్తుగానే పోలీసులు అప్రమత్తమై ఎటువంటి అలజడులకు తావు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఈ వారోత్సవాలు నేపథ్యంలో ఏఓబి సరిహద్దు ప్రాంతాల ప్రజలు భయాందోళనల మధ్య జీవనం సాగిస్తున్నారు.

నాలుగు ఆటోలకు వేలం పాట



విశాలాంధ్ర - హుకుంపేట: మండలంలో గల స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు ఆటోలు వేలం పాట వేస్తున్నట్లు సబ్ ఇన్స్పెక్టర్ సతీష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో సారా కేసుల్లో పట్టుబడ్డ నాలుగు ఆటోలను ఈ నెల 8, 9 తేదిల్లో వేలం వేస్తున్నామని ఆశక్తి గల వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో వచ్చి పేరు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. అల్లూరి సీతరామరాజు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఈ వేలం పాట నిర్వహిస్తున్నామని ఏమైనా సందేహాలు ఉంటే 9440904228 నంబర్ కాల్ చేయవచ్చని వారు కోరారు.

మండల వీఆర్‌ఓ సంఘం అధ్యక్షుడుగా నూకరాజు

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండల విఆర్‌ఓ సంఘం అధ్యక్షుడుగా తిమ్మాపురం విఆర్‌ఓ ఆర్. నూకరాజు ఎన్నికయ్యారు. శుక్రవారం అనకాపల్లి జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం వారి ఆదేశాల మేరకు ఎస్ రాయవరం మండలం గ్రామ రెవెన్యూ అధికారుల అధ్యక్ష కార్యదర్శుల ఎన్నిక స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు ఎన్నికలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులు ఆర్. నూకరాజు, ఉపాధ్యక్షులు ఎం. జోగారావు, కార్యదర్శి ఎం.ఎన్.అప్పారావు, సంయుక్త కార్యదర్శి ఇ.సాంబశివరావు, కోశాధికారిగా బి. రాజు, కార్యవర్గ సభ్యులుగా సిహెచ్. పెంటయ్య, ఎం. శ్రీను, జిల్లా కమిటీ సభ్యులు గా సిహెచ్. సూరిబాబు, డివిజన్ కమిటీ సభ్యులు గా బి. గోపిలను ఎంపిక చేశారు.

మృతుని కుటుంబానికి సాయం

విశాలాంధ్ర - పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు, భానోజీ తోట రోడ్డు నంబర్-5 లో నివాసముంటున్న సిరిపురపు గోవింద్ ఇటీవల ప్రమాదశాత్తూ మరణించిన సం గతి తెలిసిందే. ఆ కుటుంబాన్ని శుక్రవారం వార్డు కార్పొ రేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు పరామర్శించారు. వైఎస్సార్ బీమా కింద మృతుని కుటుంబానికి రూ.5 లక్షలు మంజూరు కాగా తక్షణ సాయం కింద పది వేల రూపాయలను మృతుడు భార్య లక్ష్మీకి అందజేశారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉంటూ ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని అన్నారు. కుటుంబానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వార్డు కమిటీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాగిశెట్టి శ్రీనివాస్, ఎన్ఎమ్ఆర్ మూర్తి, మాధురి, ఎల్వి రమణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

విశాలాంధ్ర - పాయకరావుపేట: పురుగుల మందు సేవించి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందినట్లు సీఐ అప్పలరాజు తెలిపారు. మండలంలోని మంగవరం గ్రామానికి చెందిన దేశంశెట్టి సన్యాసి (32) వ్యవసాయంలో నష్టాలు వచ్చాయని పురుగుల మందు సేవించి ఇటీవల ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పురుగుల మందు సేవించిన సన్యాసిని చికిత్స నిమిత్తం తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుని భార్య దేశంశెట్టి దేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పి.అప్పలరాజు తెలిపారు.

వైసీపీకి బీసీలే వెన్నెముక

జిల్లా అధ్యక్షులు పంచకర్ల

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: వైసిపి పార్టీకి బీసీలే వెన్నెముకని రాష్ట్ర ముఖ్యమంత్రి బీసీలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఈనెల ఏడో తేదీన విజయవాడలో జరగనున్న జయహో బీసీ గర్జన సభను విజయవంతం చేయాలని విశాఖ వైసిపి జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పిలుపునిచ్చారు. మద్దిలపాలెం, కృష్ణా కాలేజ్ రోడ్డు పార్టీ కార్యాయంలో విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబు ఆధ్వర్యంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 'జయహో బీసీ' వెనుకబడిన కులాలే వెన్నెముక మహాసభ గూర్చి బి.సి.ముఖ్య నాయుకులు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, శాసన మండలి సభ్యులు వరుదు కళ్యాణి, శాసన సభ్యులు తిప్పల నాగి రెడ్డి, వాసుపల్లి గణేశు కుమార్, సమన్వయ కర్తలు కే.కే.రాజు, అక్కరమాని విజయ నిర్మల, నియోజకవర్గం పరిశీలకులు తైనాల విజయ్ కుమార్, ఎస్.ఎ రెహ్మాన్, చింతలపూడి వెంకట రామయ్య, బొద్దేటి ప్రసాద్, చిక్కల రామారావు, విశం రామ కృష్ణ, ఉరుకుటి అప్పారావు, రొంగాలి జగన్నాథ, కమీషన్ సభ్యులు వక్కి దివాకర్, బి.కాంతారావు, మాజీ శాసనసభ్యులు తిప్పల గురుమూర్తి రెడ్డి, అల్లా బానుమతి, రాష్ట్ర, జిల్లా వివిధ కార్పొరేషన్ చైర్మన్లు సుజాత సత్యనారాయణ, సుజాత నూక రాజు, చొక్కాల లక్ష్మి, వళ్ళ చిన్న తల్లి, రాష్ట్ర పార్టీ అదనపు కార్యదర్శి రవి రెడ్డి, పార్టీ ముఖ్య

నాయుకులు కొండ రాజీవ్ గాంధీ, ఐ.హెచ్.ఫరూక్, మొల్లి అప్పారావు పేర్ల విజయ చంద్ర, సతీష్ వర్మ కాసి విశ్వనాదం, కార్పొరేటర్లు, రాష్ట్ర జిల్లా వివిధ బి.సి డైరెక్టర్లు, వార్డు పార్టీ బి.సి అభ్యర్థులు, వార్డు పార్టీ బి.సి అధ్యక్షులు, పార్టీ బి.సి ముఖ్య నాయకులు, పార్టీ బి.సి మహిళా ముఖ్య నాయకులు, రాష్ట్ర , జిల్లా, వార్డు, మండలం వివిధ అనుబంధ విభాగాల బి.సి అధ్యక్షులు, కార్యవర్గం సభ్యులకు పాల్గొన్నారు.

హరిత సాంకేతిక పరిజ్ఞానం ద్వారానే కాలుష్య నియంత్రణ

గీతంలో తేజ ఎయిర్ క్రాఫ్ట్ రూపశిల్పి డాక్టర్ కె.హరినారాయణ

విశాలాంధ్ర - మధురవాడ: సాంకేతిక ప్రగతి కారణంగా గడచిన 300 సంవత్సరాలలో ప్రపంచ పర్యావరణం దారుణంగా దెబ్బతిందని భవిష్యత్తులో మానవ మనుగడ ప్రమాదంలో పడకుండా ఉండాలంటే హరిత సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చేసుకోవడమే ఏకైక మార్గమని ప్రసిద్ధ వైమానిక సాంకేతిక నిపుణుడు, తేజా ఎయిర్ క్రాఫ్ట్ రూపశిల్పి, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కోటా హరినారాయణ అభిప్రాయ పడ్డారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రీన్ అండ్ సస్టైనబుల్ టెక్నాలజీస్ అనే అంశం పై ఆయన ప్రసంగించారు. కాలుష్యం పెరగడానికి థర్మల్ విద్యుత్తు ఉత్పాదన, పరిశ్రమలు, వాహనాలు, భవన నిర్మాణం ప్రధాన కారణాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కాలుష్యం పెరగడానికి అమెరికా, చైనా తరవాత భారతదేశం కారణం అన్నారు. రానున్న 50 సంవత్సరాలలో భారతదేశ కాలుష్యం మూడింతలుగా పెరిగే అవకాశం ఉందన్నారు. సంప్రదాయేతర ఇందన వనరుల వినియోగంతో పాటు హరిత భవన నిర్మాణం, విద్యుత్తు వాహనాల వినియోగం, వ్యవసాయ రంగంలో రసాయనిక ఎరువులు, క్రిమి సంహరకాల వినియోగాన్ని తగ్గించడం, పరిశ్రమలలో హరిత సాంకేతిక పరిజ్ఞాన వినియోగం పెంచడం అవసరమని సూచించారు. వైమానిక రంగం కూడా 2.5 శాతం కాలుష్యానికి కారణమవుతున్న దృష్ట్యా హైడ్రోజన్ ఇందనం వాడకంపై అధ్యయనాలు జరుగుతున్నాయని తెలిపారు. ఏ సాంకేతిక పరిజ్ఞానం ఐనా దేశీయంగా అభివృద్ధి చేసుకోవడం అవసరమని సూచించారు. గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం అధ్యక్షత వహించి ప్రసంగిస్తూ రక్షణ రంగం, ఔషధ రంగం, అంతరిక్ష రంగాలలో దేశం స్వయం సంవృద్ధి దిశగా అడుగులు వేస్తోందన్నారు. గీతం వంటి విశ్వవిద్యాలయాలకు డాక్టర్ కోటా హరినారాయణ వంటి నిపుణులు మార్గదర్శకం వహిస్తే పరిశోధనలకు ఊపిరి పోసినట్లవుతుందన్నారు. కార్యక్రమంలో భాగంగా డాక్టర్ కోటా హరినారాయణను గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ సి.విజయశేఖర్ సన్మానించారు.

స్టీల్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కు తీసుకోవాలి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న దీక్షలు 659వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరంలో కూర్చున్న ఇ ఎస్ అండ్ ఏఫ్ , ఇ. ఆర్.. ఎస్, ఇ. ఎం. డి, స్టోర్స్ , టెక్ .సెల్ కార్మిక వర్గాన్ని నుద్దేశించి వై.మస్తానప్ప, కామ్రేడ్ జె.రామక్రిష్ణ, కొమ్మినేని శ్రీనివాసరావు, చిత్రాల సన్యాసిరావు, సిహెచ్. సత్యనారాయణలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడిపించాల్సింది పోయి ప్రైవేటీకరణకు పూనుకోవడం తగదన్నారు. గతేడాది 950 కోట్ల నికర లాభలతో 28,500/- కోట్ల పైచిలుకు టర్నోవర్ చేసిన పరిశ్రమను ఈ సంవత్సరం కావాలని నష్టాల దిశగా నెట్టారని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రప్రభుత్వం కనుసన్నలలో నడిచే డైరెక్టర్‌ల బోర్డు పెత్తనంలో రిపేర్‌లకు కావలసిన స్పేర్స్ ఇవ్వకుండా, సకాలంలో ఉత్పత్తుల తయారీకి కావలసిన కోకింగ్ కోల్ బాయిలర్ కోల్ వంటి ముడిసరుకులను కొనుగోలు చేయకుండా తాత్సారం చేసి ఇప్పటి వరకు నెలలు తరబడి బ్లాస్ట్ ఫర్నేస్‌లో ఉత్పత్తి నిలిపివేయడం వలన నష్టాలు వచ్చే దిశగా కంపెనీని నడుపుతున్నారని, ఇటువంటి చర్యలు కడు శోచనీయమని, ప్లాంట్‌ను నష్టాల వైపు నెట్టి ఆపై దీనిని ప్రైవేటు వారికి కారుచౌకగా ముట్ట చెప్పాలని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలో స్థానిక యాజమాన్యం కూడా పాలుపంచుకుంటున్నదని ఆరోపించారు. లక్షల మందికి అన్నం పెట్టే ఈ విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ లేదా మూసి వేసే దిశగా ప్రణాళికలు రచించడం హర్షణీయం కాదన్నారు. రాబోవు కాలంలో పోరాట కమిటీ తీసుకున్న తీర్మానం ప్రకారం డిసెంబర్ 10వ తేదీ మానవ హక్కుల పరిరక్షణ దినం సందర్భంగా నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని, అలాగే వచ్చే నెల 26వ తారీకు రెండు సంవత్సరములు పూర్తవుతున్న సందర్భంగా పెద్ద ఎత్తున మహాసభ ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించడం జరిగిందని దీనిని జయప్రదం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిపార్ట్మెంట్ నాయకులు సిహెచ్ వి సత్యనారాయణ, ఎమ్ గోవిందు, జి శ్రీనివాసు, నీలకంఠ రావు, రమేష్, ఉరుకుటి అప్పారావు, దేవుడు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ సిటీ పనులను త్వరితగతిన పూర్తి చేయండి

కమిషనర్ రాజాబాబు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: స్మార్ట్ సిటీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని తమ ఛాంబర్‌లో స్మార్ట్ సిటీ పనుల పురోగతిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్మార్ట్ సిటీ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. నగరంలో పాతపట్నంలోని చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ, సీవేజ్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్, సోలార్ విద్యుత్ పనులు పురోగతిని ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కోస్టల్ బ్యాటరీ నుండి కిర్లంపూడి లే-అవుట్, పాండురంగాపురం తదితర ప్రాంతాలలో చేపడుతున్న అభివృద్ధి పనులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలుసుకొని అధికారులకు కొన్ని సూచనలు చేశారు. పాత నగరంలో సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ పనులు, భూగర్భ డ్రైనేజీ పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకుని పనులు వేగవంతం చేసి 2023 మార్చి నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని ఇంజనీరు రవికృష్ణ రాజు, పర్యవేక్షక ఇంజనీరు వినయ్ కుమార్, కార్యనిర్వాహక ఇంజనీరు సుధాకర్, స్మార్ట్ సిటీ మేనేజర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏయూలో అంబేద్కర్ విజన్-మోడీస్ ప్రొవిజన్ అంశంపై సదస్సు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఆంధ్రవిశ్వవిద్యాలయం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చైర్ ఆధ్వర్యంలో శనివారం 'అంబేద్కర్ ఆలోచనలు డిజిటల్ ఇండియాతో సాకారం చేసిన మోదీ' అంశంపై ఒకరోజు సదస్సును నిర్వహిస్తున్నారు.శనివారం ఉదయం 10 గంటలకు ఏయూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అసెంబ్లీ మందిరంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో శుక్రవారం విడుదల చేసారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాద రెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ కలలుగన్న సమానత్వం, సమాన అవకాశాలు డిజిటల్ ఇండియాతో సాకారం అయ్యాయన్నారు. గ్రామీణ ప్రాంతాలకు సైతం అన్ని సేవలు అందుబాటులోనికి వచ్చాయన్నారు. అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ డిజిటల్ లిటరీసీ ప్రధానంగా ప్రజల్లో అవగాహన పెంపొందించే దిశగా సదస్సు నిర్వహణ జరుపుతున్నామన్నారు. సదస్సులో కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి ఏ.నారాయణ స్వామి వర్చువల్ విధానంలో ప్రసంగిస్తారు. డిజిటల్ ఇండియాతో ప్రజలకు సమాన సేవలు, అవకాశాలు లభిస్తున్నాయన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవడంపై నిపుణులు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, అకడమిక్ డీన్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో చైర్ ప్రొఫెసర్ ఏర్పాటు చేసిన లీ ఫార్మ లిమిటెడ్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో లీ ఫార్మ లిమిటెడ్ చైర్ ప్రొఫెసర్‌ను ఏర్పాటు చేస్తూ ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డికి సంస్థ డైరెక్టర్ ఏ.లీలా రాణి లేఖ అందజేశారు. శుక్రవారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డితో లీ ఫార్మ లిమిటెడ్ డైరెక్టర్ ఏ.లీల రాణి సమావేశమయ్యారు. ఏయూలో ఏర్పాటవుతున్న చైర్ ప్రొఫెసర్‌లు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిలుస్తాయన్నారు. ఇటువంటి బృహత్ కార్యక్రమంలో తమను భాగస్వాములను చేయడం పట్ల ఆనందరం వ్యక్తం చేశారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా అవసరమైన పరిశోధనలు చేసి, పరిష్కారాలు చూపాలనే ఆలోచన ఎంతో ఉదాత్తమైనదన్నారు.

కార్నింగ్ గొరిల్లా గ్లాస్ విక్టస్ విడుదల

విశాలాంధ్ర/విశాఖపట్నం: కార్నింగ్ సంస్థ తన సరికొత్త గ్లాస్ వినూత్నతకార్నింగ్ గొరిల్లా గ్లాస్ విక్టస్2ను ఆవిష్కరించింది. కార్నింగ్ తన కార్నింగ్ గొరిల్లా గ్లాస్ పోర్ట్‌ఫోలియోను విస్తరించడం ద్వారా గ్లాస్‌ఉపయోగాల పరిధిని పెంచుతూనే ఉంది.

కొత్త గ్లాస్ కంపోజిషన్‌తో, గొరిల్లా గ్లాస్ విక్టస్ 2 గొరిల్లా గ్లాస్ విక్టస్ స్క్రాచ్ రెసిస్టెన్స్‌ను సంరక్షిస్తూనే, ప్రపంచంలోనే అత్యంత ఉన్నతంగా ఇంజనీరింగ్ చేయబడి, కాంక్రీటు వంటి కఠినమైన ఉపరితలాలపై మెరుగైన డ్రాప్ పనితీరును అందిస్తోంది. "స్మార్ట్‌ఫోన్‌లు మన డిజిటల్ జీవితాలకు కేంద్రంగా ఉన్నాయి.

స్పష్టమైన, డ్యామేజ్-ఫ్రీ డిస్‌ప్లేలపై ఆధారపడటం పెరుగుతుండడంతో అసాధారణమైన స్క్రాచ్, డ్రాప్ రెసిస్టెన్స్ అవసరం పెరిగింది. కాంక్రీటు వంటి కఠిన ఉపరితలాలు ప్రతిచోటా ఉన్నాయి" అని కార్నింగ్ గొరిల్లా గ్లాస్ వైస్ ప్రెసిడెంట్, జనరల్ మేనేజర్ డేవిడ్ వెలాస్క్వెజ్ అన్నారు.

పూర్వవిద్యార్థులు ఏయూకు గర్వకారణంగా నిలుస్తున్నారు

ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఆంధ్రవిశ్వవిద్యాలయం పూర్వవిద్యార్థులు వర్సిటీకి గర్వకారణంగా నిలుస్తున్నారని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం ఏయూ కెమిస్ట్రీ విభాగంలో విభాగ పూర్వవిద్యార్థి జి.సుబ్బరాజు తన సొంత ఖర్చుతో నిర్మించి అందించిన సమావేశ మందిరాన్ని వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉన్నత స్థానాలలో స్థిరపడిన పూర్వవిద్యార్థులు తమ జ్ఞానాన్ని, నైపుణ్యాలను నేటి తరానికి అందించాలని సూచించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాస రావు, డీన్‌లు ఆచార్య కె.బసవయ్య, వి.సిద్దయ్య, జి.సుధాకర్ విభాగాధిపతి ఆచార్య శ్యామల, తదతరులు పాల్గొన్నారు. అనంతరం లెక్చర్ హాల్‌ను తయారుచేసి అందించిన పూర్వవిద్యార్థి సుబ్బరాజును సత్కరించారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ ఏయూ తమ భవిష్యత్తును నిర్మించుకునే మార్గాన్ని చూపిందన్నారు. దీనికి ఎల్లవేళలా తాము రుణపడి ఉంటామన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు రగ్గుల పంపిణీ

విశాలాంధ్ర - రావికమతం : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా రావికమతం భవిత కేంద్రంలో నిర్వహించిన కార్య క్రమంలో భాగంగా శుక్రవారం 60 మంది దివ్యాంగ విద్యార్థులకు చీడికాడ మండలం తురువోలు గ్రామానికి చెందిన రెడ్డి సన్యాసి నాయుడు మరియు చోడవరం గ్రామానికి చెందిన జూరెడ్డి ప్రకాష్‌లు సంయుక్తంగా పదివేల రూపాయలు విలువచేసే 60 రగ్గులను అనకాపల్లి జిల్లా సహిత విద్య సమన్వయకర్త శ్రీమతి బి.శకుంతల చేతుల మీదుగా దివ్యాంగ విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అనకాపల్లి జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయకర్త శ్రీమతి బి.శకుంతల మాట్లాడుతూ దివ్యాంగు విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉచితంగా అనేక సేవలు మరియు సదుపా యాలను అందిస్తుందని వాటిని సద్వినియోగ పరచుకోవాలని అన్నారు. అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా రన్నింగ్, క్యారమ్స్, మ్యూజికల్ చైర్, డ్రాయింగ్, లాంగ్ జంప్ వంటి పోటీలను నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. దివ్యాంగులకు రగ్గులను వితరణ చేసిన రెడ్డి సన్యాసి నాయుడు మరియు జూ రెడ్డి ప్రకాష్‌లను జిల్లా సహితవిద్య సమన్వయకర్త శకుంతల అభినందించారు. దివ్యాంగులకు రగ్గులను వితరణ చేసిన రెడ్డి సన్యాసినాయుడు మరియు జూ రెడ్డి ప్రకాష్ లను జిల్లా సహితవిద్య సమన్వయకర్త శకుంతలఅభినందించారు. దాతలు రెడ్డి సన్యాసినాయుడు మాట్లాడుతూ దివ్యాంగులకు సేవ చేయడం గొప్ప అదృష్టమని వారికి సేవ చేస్తే దేవుని సేవతో సమానమని అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి రాము, ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, జగన్నాథ నాయుడు, దివ్యాంగ విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

విశాలాంధ్ర - నాతవరం : గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నాతవరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సర్పంచులకు, ఎంపిటీసిలకు, సచివాలయం సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పిఓటి శ్రీనివాస్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీలో అభివృద్ధిపై 29 శాఖల పనితీరు, ఆదాయ వ్యయాలు పంచాయతీలో తెలుసు కోవాలని, అలాగే ఈ ప్రభుత్వ శాఖలతో గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. గ్రామంలో మౌలిక వసతులు కల్పించుకునేందుకు ప్రతి శాఖ దోహద పడుతుందన్నారు. ముఖ్యంగా ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులు కలిసి గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచడమే కాకుండా ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండేందుకు తగు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. దీనికి సంబంధించి ప్రజాప్రతినిధులకు ఈ ప్రభుత్వ 29 శాఖల అధికారులు స్పందించాలని శిక్షణ తరగతుల్లో తెలియజేశారు. అలాగే గ్రామంలో పౌష్టికాహారం స్వచ్ఛమైన త్రాగునీరు, పారిశుధ్యం మెరుగుపరచడం, విద్యుత్, వివిధ శాఖల పనితీరు ఎల్లప్పుడు గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎల్.యాదగిరిశ్వరరావు, ఈఓపిఆర్‌డి ప్రేమలీల, ఏపిఓ చిన్నారావు, పంచాయతీ కార్యదర్శి చినబాబు, హుస్సేన్, సర్పంచులు మిరపల రమణ, కోసూరు విజయ, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నగర ప్రజల జీవన సౌలభ్యంపై ప్రజాభిప్రాయ సేకరణ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : కేంద్ర గృహ నిర్మాణ మరియు పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న, ఈజ్ ఆఫ్ లివింగ్ ఇండెక్స్, మున్సిపల్ పెర్ఫార్మెన్స్ ఇండెక్స్, క్లైమేట్ స్మార్ట్ సిటీస్ అసెస్‌మెంట్ ఫ్రేమ్‌వర్క్, డేటా మెచ్యూరిటీ అసెస్‌మెంట్ ఫ్రేమ్‌వర్క్ అనే 4 అంశాలను కలిపి అర్బన్ అవుట్ కం ఫ్రేమ్‌వర్క్-2022ను విద్య, వైద్య, నీరు, పారిశుధ్యం, ఆహ్లాదకరం, రవాణా, హౌసింగ్, భద్రత, ఆర్థిక సామర్థ్యం, పర్యావరణ నిర్వహణ, జీవన సౌలభ్యం అనే అంశాలపై దేశంలోని 266 నగరాలలో ఈ డేటాని సేకరించటం జరుగుతుంది. ఈ సందర్భంగా జీవిఎంసి స్మార్ట్ సిటీ సిబ్బంది భీమిలిలోని పి.ఎస్.ఎం. స్కూల్ లో సిటిజన్ పర్సెప్షన్ సర్వే పౌరుల అభిప్రాయంపై అవగాహన కార్యక్రమంలో స్మార్ట్ సిటీ సిబ్బంది పాల్గొని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నగర జీవన ప్రమాణాలపై విశాఖ స్మార్ట్ సిటీ అభివృద్ధికి ఫీడ్బ్యాక్ ఇవ్వాలని వివరించారు. అంతే కాకుండా విద్యార్థుల ద్వారా తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పౌరుల అభిప్రాయ సేకరణలోనూ, రేటింగు లోనూ తమ అభిప్రాయలను తెలిపే విధంగా విద్యార్థులు తల్లిదండ్రులకు వివరించాలన్నారు. ఈజ్ ఆఫ్ లివింగ్ ఇండెక్స్-2022 లో భాగంగా జీవిఎంసి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ నిర్వహించే సిటిజెన్ పర్సెప్షన్ సర్వే లో చురుకుగా పాల్గొనాలని, నగరంలో ప్రజల జీవన సౌలభ్యం, మెరుగుదల గురించి మీ అభిప్రాయాన్ని తెలియజేయాలని అభ్యర్థించారు. సర్వేలో పాల్గొనడానికి ఈ %https://eol2022.org%/ లింక్‌లో గాని లేదా పోస్టర్‌లో ఉన్న కోడ్‌ను గాని స్కాన్ చేసి మన నగరానికి మంచి రేటింగ్‌ను నమోదు చేసి దేశంలోనే మన విశాఖ స్మార్ట్ సిటీని అగ్రస్థానంలో నిలపాలని స్మార్ట్ సిటీ సిబ్బంది తెలిపారు. అలాగే మన విశాఖ నగరానికి మంచి రేటింగ్ ని అందించి దేశంలోనే మన విశాఖపట్నంను అగ్రస్థానంలో నిలపాలని స్మార్ట్ సిటీ సిబ్బంది విద్యార్థులను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పి.ఎస్.ఎం. స్కూల్ ప్రధానోపాధ్యురాలు ఎం. తిరుమల శ్రీదేవి, స్మార్ట్ సిటీ ప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతి నిధులు మంజూరు చేయాలి

విశాలాంధ్ర - ఆనందపురం : రాజ్యసభ సభ్యులు శ్రీ జివిఎల్ నర్సింహారావు విశాఖపట్నం జిల్లా పార్టీ కార్యాలయంలో విశాఖ జిల్లా అధ్యక్షులు మేడపాటి రవీంద్ర రెడ్డి ఆధ్వర్యంలో బిజేపి కిసాన్ మోర్చ ఉత్తరాంధ్ర జోన్ సోషల్ మీడియా కన్వీనర్ పి.వి.వి. ప్రసాదరావు పట్నా యక్, అంతర్జాతీయ హ్యూమన్ రైట్స్ కార్యదర్శి కె.శివ ప్రసాదరావు మర్యాద పూర్వకంగా కలిసి ఆనందపురం మండలం వెల్లంకి గ్రామ పంచాయతీ 15 ఫైనాన్స్ నిధులు కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచా యతీకి మంజూరు చేసిన నిధులు 31,41,676, రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకుందని, ఈ నిధులు లేకపోవడం, వెల్లంకి గ్రామ పంచాయతీ అభివృద్ధి కుంటు పడిందని, తక్షణమే వెల్లంకి గ్రామ పంచాయతీ కి 15 ఫైనాన్స్ 2021-2022 సంబంధించిన నిధులు మంజూరు చేయించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ నిధులు వెనక్కి తీసుకొని అధికారం రాష్ట్ర ప్రభుత్వంకి లేదని, అధికారులతో మాట్లాడి వెనక్కి వెళ్లిన నిధులు తక్షణమే మంజూరు చేయి స్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బిజేపి నాయకులు పి.వి.వి. ప్రసాదరావు పట్నాయక్ అత్యధికంగా ఈ- శ్రమ్ కార్డులు, ప్రధానమంత్రి ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు ముద్ర రుణాలు,హెల్త్ కార్డులు, నిరుపేద కుటుంబాలకు,బిజేపి పార్టీ తరపున సేవలు అందించారని అభినందనలు తెలిపారు.

పాస్టర్లకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ

విశాలాంధ్ర - హుకుంపేట : గిరిజన ప్రాంతాల్లో నిత్యం దైవ భక్తితో ప్రజలు జీవించేల దైవజనులు పూర్తి భాధ్యత తీసుకోవాలని లవన్ కేర్ మినిస్ట్రీష్ వ్యవస్థాపకుడు డా.యేసు పాదం పేర్కొన్నారు. మండలంలోని గూడ పంచాయితీ కేంద్రాంలో బిలివర్స్ చర్చ్‌లో వైసీపీ పార్టీ మాజీ వైస్ ఎంపీపీ బత్తిరి రవిప్రసాద్ కుమారుడు చరణ్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన మాట్లాడుతు దైవజనులు ప్రజలకు భక్తి శ్రద్ధలపై సందర్భంగా గిరిజన మారుమూల ప్రాంతాల్లో పని చేసే 150 మంది క్రైస్తవ పాస్టర్లకు శుక్రవారం స్మార్ట్ ఫోన్లు లవన్ కేర్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు డా.యేసుపాదం చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ల అసోసి యేషన్ ప్రెసిడెంట్ మోజేష్, కార్యదర్శి జేమ్స్, కృష్ణా, సునిలాల్, ప్రభుదాస్ బాబురావు, మోహన్, ప్రసాద్. తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముక్కా జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - పెందుర్తి : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ముక్కా రాము నాయుడు తన జన్మదిన వేడు కలను సుజాతనగర్ లోని ఆకార్ బాలికల సంరక్షణ కేంద్రంలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఆకార్ బాలికల సమక్షంలో కేకు కట్ చేశారు. అనంతరం బాలికలకు పండ్లు, స్వీట్లు కేకు అందజేశారు. ఈ సందర్భంగా రాము నాయుడు మాట్లాడుతూ, ఆకార్ బాలికల సంర క్షణ కేంద్రంలో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

నేడు ఎస్సార్ పురంలో 'ఇదేం ఖర్మ ఈ రాష్ట్రానికి'

విశాలాంధ్ర - పెందుర్తి : మండలంలోని ఎస్ఆర్ పురం పంచాయతీలో శనివారం ఉదయం 10 గంటలకు ఇదేం కర్మ ఈ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటినుండి బడుగు బలహీన వర్గాలు, కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులు అందరూ ఇదేం కర్మ ఈ రాష్ట్రానికి అంటున్నారని అదే నినాదంతో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం సాగిస్తున్న అరాచకత్వాన్ని దోపిడీతనాన్ని ప్రజలకు వివరిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ కార్పొరేటర్లు ఎంపీటీసీలు సర్పంచులు నాయకులు పాల్గొంటారని, ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు.

లారీ, బైక్ ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర - హుకుంపేట : మండలంలోని తీగలవలస పంచాయితీ ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామమైన పాము రాయిలో లారీ, బైక్ ఢీకొని తీవ్ర గాయలైంది. దీనికి సంబంధించిన వివరాలు ఈ విధంగా. ఉన్నాయి. శుక్రవారం కామయ్యపేట గ్రామం వైపు నుంచి ఒడిశా ప్రాంతాం వైపు వెల్తున్న లారీ పాములాయి నుంచి వస్తున్న బైక్‌ను డి కొట్టింది. ఈ ఘటనలో పాములాయి గ్రామానికి చెందిన మర్రి కామరాజు అనే 25 ఏళ్ళ యువకుడికి కుడికాలు విరిగి తీవ్ర గాయలైంది. విషయం తెలుసు కున్న కుటుంబ సభ్యులు కొంత మేరకు హుటహుటిన ప్రైవేటు వాహనంపై తీసుకు వెళ్లి అక్కడ నుంచి 108వాహానం ద్వారా పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఘనంగా కనకమహాలక్ష్మి అమ్మవారి సారె ఊరేగింపు

విశాలాంధ్ర - యమంచిలిరూరల్ : పట్టణ మున్సి పాలిటీలో ధర్మవరం వీధిలో కొలువైయున్న శ్రీకనక మహాలక్ష్మీ అమ్మవారి మార్గశిర మాసోత్సవాలలో భాగంగా శుక్రవారం నాడు ప్రతీ సంవత్సరం వలే అమ్మవారి సారెను పుర వీధులలో ఊరేగింపుగా తీసుకుని వెళ్లి అమ్మవారికి సమర్పించారు.అనంతరం శాకాంబరీ దేవి అవతారంలో ఉన్న అమ్మవారి విగ్రహాన్ని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి, తీర్ధ ప్రసాదాలు స్వీకరించి, ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో భవానీ మాలధారణ భక్తులు,కమిటీ సభ్యులు కొఠారు సాంబ, వెంకట్రావ్, రాము తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని పాదచారుడు మృతి

విశాలాంధ్ర - యలమంచిలి : పట్టణ పరిధిలో గల తెరువుపల్లి గ్రామానికి చెందిన జాజుల రత్నాకర్ స్వామి(63) అను వ్యక్తిని బైక్ ఢీకొట్టడంతో మృతి చెందారు. ఈ ఘటనపై టౌన్ ఎస్సై కె.పాపినాయుడు తెలిపిన వివరాల ప్రకారం గురువారం నాడు తెరువుపల్లి గ్రామానికి చెందిన జాజుల రత్నాకర్ అనే వృద్ధుడు తన వరిపోలానికి నీరు తోడుటకు గాను డీజిల్ కొనుక్కుని యలమంచిలి నుంచి పెంజెరువు గట్టుపై నుండి నడుచుకుంటూ తన గ్రామానికి వెళ్తుండగా జంగులూరు నుంచి యలమంచిలి వైపు వస్తున్న ఎపి39 హెచ్ ఏ6793 నెంబర్ గల బైకు వెనుక నుంచి అతనిని ఢీకొట్ట డంతో ప్రధమ చికిత్స కోసం యలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనంతరం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందారన్నారు.మృతుని బంధువులు శుక్రవారం నాడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు

చినఉప్పలంలో 'గడపగడపకు మన ప్రభుత్వం'

విశాలాంధ్ర - యస్. రాయవరం : మండలంలో పెద ఉప్పలం గ్రామం పరిధిలో పెద ఉప్పలం ఎస్సీ కాలనీ, చిన ఉప్పలం గ్రామంలో పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రభుత్వం పథకాలు గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రామచంద్రమూర్తి, సర్పంచులు కోశెట్టి రమణ, మల్లే లోవరాజు, వైసీపీ నాయకులు పాలిశెట్టి పెద ఈశ్వరరావు, అద్దేపల్లి నూకినాయుడు, రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన దుర్గాలమ్మ అమ్మవారి ఆలయం

అమ్మవారిని దర్శించుకున్న జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము

విశాలాంధ్ర - కొమ్మాది : విశాఖపట్నం జిల్లా మధురవాడ చంద్రంపాలెం జాతర గట్టు శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి ఆలయంలో మార్గశిర మాసం రెండవ శుక్రవారం స్వాములు భవానీలు భక్తులతో కిటకిట లాడింది, ఈ రోజు ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ప్రత్యేక కుంకుమార్చన, పుష్పార్చన మొదలగు పూజా కార్యక్రమాలు జరిపించడం జరిగింది, సాయంత్రం అమ్మవారికి సుగంధ ద్రవ్య పంచామృత జలాభిషేకములు ఆలయ అర్చకులు పట్నాల సుబ్బారావు శర్మ, హరిప్రసాద్ శర్మ, మూర్తి శర్మ, శాస్త్రోక్తంగా జరిపించడం జరిగింది, ఆలయానికి వచ్చిన భక్తులకు పులిహోర ప్రసాదం ఆలయ కమిటీ సభ్యులు పంపిణీ చేయడం జరిగింది, జివియంసి జోన్ 2 కమిషనర్ బొడ్డేపల్లి రాము అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపించడం జరిగింది, మరియు శుక్రవారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు దుర్గాదేవి అమ్మవారి మాలలు ఆలయ అర్చకులు ద్వారా ధరించి దీక్షలు ప్రారంభించారు. అదే విధంగా అమ్మవారి ఆలయంలో ఉన్న అయ్యప్ప స్వామి పీఠం 41 రోజులు దీక్ష పూర్తి చేసిన స్వాములు గురుస్వామి పిళ్లా వెంకటరమణ, పిళ్లా శ్రీనివాసరావు, నాగోతి అప్పారావులచే ఇరు ముడులు కట్టించుకొని శబరిమలై యాత్ర బయలు దేరి వెళ్లడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు పిళ్లా సూరిబాబు, సెక్రటరీ నాగోతి తాతారావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, సభ్యులు పిళ్లా వెంకటరమణ, కేశనకుర్తి అప్పారావు, యస్.ఆర్.బాబు, పిళ్లా మోహన్ శివ కృష్ణ, నాగోతి అప్పలరాజు అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనలో రైతన్నలు

విశాలాంధ్ర - కె కోటపాడు : వరి పంట పూర్తిగా పండి కోత కోసే సమయంలో ఆకాశం మేఘావృతం కావడంతో రైతన్నలు ఆందోళనలకు గురవుతున్నారు. ఎంతో శ్రమకోర్చి పండిన వరి పంట నీటి పాలవుతుందన్న భయాందోళనలతో రైతులు ఉన్నారు. ఈ సంవత్సరం కే.కోటపాడు మండలంలో 2245 హెక్టార్లలో వరి వేశారు. విత్తనాలు వేసిన దగ్గర నుండి పంట చేతికి వచ్చేవరకు రైతుకు దినదిన గండంగానే ఉంటుంది. అధిక శాతం రైతులు రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేసిన సాంబామసూరి, ఆర్జెఎల్, స్వర్ణ, ఇంద్ర తదితర వరి విత్తనాలు వేశారు. వర్షాలు ఆశాజనకంగా కురవడంతో చెరువులన్నీ పూర్తిగా నిండిపోవడం, మెట్ట ప్రాంతాల్లో కూడా వరి పంట వేయడం జరిగింది. ఈ సంవత్సరం కొన్ని రకాల వరి పంటలకు ఎక్కువగా తెగుళ్ల సోకటంతో వేలాది రూపాయలు వెచ్చించి పురుగు మందులు కొనుగోలు చేశారు. అయినా కొంచెం దిగుబడి తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం 30% వరకు పంటలు పూర్తిగా పండి పోవడంతో, కోత కోసి పంట పొలాల్లోనే ఆరబెట్టారు. రెండు రోజుల నుండి వాతావరణంలో మార్పులు కనిపిస్తుండటంతో పంట పొలాల్లో ఉన్న చేలను కుప్పలుగా పెట్టడానికి రైతులు పరుగులు తీస్తున్నారు. వ్యవసాయ అధికారులు ప్రస్తుత సమయాల్లో వాతావరణంపై ముందుగా రైతులకు పలు సూచనలు సలహాలు అందించాలని పలువురు కోరుతున్నారు.

ఫ్రైడే డ్రైడేలో కుక్క కాటు

విశాలాంధ్ర - మధురవాద : మలేరియా నియంత్రణ సిబ్బందిలో జగదీశ్వరి అనే మహిళ ను ఓశునకం కాటేసింది. మధురవాడ జోన్ 7వ వార్డు మొగదారమ్మ కోలనీలో శుక్రవారం ఫ్రైడే - డ్రైడే కార్యక్రమం నిర్వహించేందుకు ఎప్పటి లాగానే అందరికన్నా ముందుగా ఆవిభాగపు సూపర్వైజర్ బేబి, ఇతర సిబ్బందితో కలిసి ఆకోలనీలోకి అడుగు పెడుతుండగా ఓ ఊరకుక్క జగదీశ్వరి కుడికాలు పై రక్తం వచ్చేలా కాటేసింది. గురవారం(నిన్న) ఇక్కడే పారిశుధ్య పనులు పర్యవేక్షించే మహిళను కాటేసేందుకు పయత్నించింది. దీనితో ఆ కోలనీలో కుక్కలు, పందులు వీరవిహారం చేస్తుండటం, ఎన్నిమార్లు ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకు వెళ్ళినా వారు స్పందించటం లేదని, ఇప్పటికైనా పరిగి పోయిన పందులు, కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకోవాని ఆ కాలనీ వాసులు కోరుతున్నారు.

ఇళ్ల స్థల పట్టాల పంపిణీ

విశాలాంధ్ర - మల్కాపురం : పారిశ్రామిక ప్రాంతం పరిధి 61 వార్డులో పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. శుక్రవారం ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొణతాల సుధా ముఖ్య అతిథులుగా పాల్గొని లబ్ధిదారులకు పట్టాల పంపిణీ చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆదారి ఆనంద్‌కుమార్ ఆదేశాల మేరకు 1086 339, సచివాలయం జనతా కాలనీ నందు మరియు 1086344 మరియు 1086 345 మరిడిమాంబ సచివాలయం నందు ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ చేపట్టినట్టు తెలిపారు జగనన్న ప్రభుత్వంలో ప్రతి ఒక్క పేదవాడికి సొంత ఇంటి కల నెరవేర్చడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో కొల్లి నూక రెడ్డి, దాడి సత్యనారాయణ, బుస అప్పలరెడ్డి, చట్టి నూకరాజు, విజయ్, నరేష్, స్వప్న, కొండలరావు, శ్రీనివాసు, రామకృష్ణ, స్పందన బాబురావు వైఎస్ఆర్సిపి నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు వమ్మవరం విద్యార్థిని ఎంపిక

విశాలాంధ్ర - యస్. రాయవరం : మండలంలో వమ్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థిని అండర్ 17 విభాగంలో జోగ అమ్మాజీ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక అయినట్లు పిఇటి ఎస్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. గత నెల 30 తేదీన పరవాడ మండలం లేకుర్తి గ్రామంలో జరిగిన జిల్లా స్థాయి జరిగిన పోటీల్లో ఈ విద్యార్థిని ఎంపిక చేశారు. ఈ ఎంపిక పట్ల ప్రధానోపాధ్యాయుడు సాయి రమేష్ తదితరులు అభినందించారు.

రైతు భరోసా కేంద్రంలో రైతులకు అవగాహన సదస్సు

విశాలాంధ్ర - మునగపాక : మండలంలోని అరబుపాలెం గ్రామంలో రైతులకు వ్యవసాయ సలహా మండలి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సందర్భంగా సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు బొడ్డేడ హేమ బుజ్జి మాట్లాడుతూ రైతులకు అనగా క్వింటాలకు 2040 మద్దతు ధర ప్రభుత్వం ఇస్తుందని ఈ పంట నమోదు చేసు కున్న రైతులంతా రైతు భరోసా కేంద్రాల ద్వారా అమ్మకాలు జరపాలని వారు కోరారు. ధాన్యం వేసిన 21 రోజుల్లో డబ్బు వారి అకౌంటులకు జమవుతుందని, మధ్యవర్తుల ద్వారాఅమ్మకాలు చేయవద్దని రైతులకు వారు సూచించారు. అలాగే రైతు భరోసా కేంద్రంలో రాబోయే రబీ సీజన్ లో రైతులకు అవసరమైన ఎరువులు విత్తనాలు లభ్యమవుతాయని, ఇంకా అవసరం ఉన్న రైతులు రైతు భరోసా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సర్పంచ్, ఎంపీటీసీ రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సలహా మండలి సభ్యులు రవిరాజ్, రైతులు మునిలి నాయుడు, రామకృష్ణ, సూర్యనారాయణ రైతులు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం

విశాలాంధ్ర - అనందపురం : ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పొలాకి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు విద్యుత్ తీగలపై చెట్లు కొమ్మలు, ఉండటం వలన నిర్వహణ పనులు చేపట్టబడుతుందని అందువలన ఈ ప్రాంతాలకు ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 2:30 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుంది. పెద్దిపాలెం, పల్లి పేట, మచ్చవాని పాలెం పారిశ్రామిక, వ్యవసాయ, గృహ వినియోగదారులకు అంతరాయం కలుగును ప్రజలు ,సహకరించాలని విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం నాడు ఒక ప్రకటనలో తెలియపరిచారు.

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర - వన్ టౌన్ : విశాఖ నగర ప్రజల ప్రజా ఆరోగ్యాన్ని కాపాడేందుకు, ఈ నగరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు, రాత్రి, పగలు శ్రమిస్తూ, కరోనా లాంటి ప్రాణాంతక వ్యాధులు విలయతాండవం చేస్తున్నా ప్రాణాలకు తెగించి శుభ్రం చేస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య కాంట్రాక్ట్ కార్మికులుకు, క్లాప్ వెహికల్ డ్రైవర్లకి ఇచ్చిన హామీలు మూడున్నరేళ్ళు గడిచినా అమలు చేయకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని జీవీఎంసి ఎంప్లాయిస్ యూనియన్, (ఏఐటీయూసీ)అధ్యక్షులు పడాల రమణప్రశ్నించారు. శుక్రవారం ఉదయం. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం వద్ద ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఆధ్వర్యంలో కార్యాలయంలో డిసెంబర్ 7, 8 తేదీల్లో ఒంగోలు లో జరగబోయే రాష్ట్ర 4 మహాసభల వాల్ పోస్టర్లు విడుదల చేసి అనంతరం పడాల రమణ మాట్లాడుతూ. రాష్ట్రంలో మున్సిపల్ కార్మికుల పరిస్థితి ఇంటి పేరు కస్తూరి వారు ఇంట్లో గబ్బిలాల కంపుగా మారిందని ఎన్నికల ముందు మున్సిపల్ కార్మికుల యొక్క శ్రమ రాష్ట్ర అభివృద్ధికి పట్టణాలు సుందరంగా తీర్చిదిద్దడంలోనూ ప్రజల ఆరోగ్యాలు కాపాడడంలోనూ ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్న మున్సిపల్ ఉద్యోగులు కాంట్రాక్ట్ కార్మికుల యొక్క రుణం ఏమిచ్చినా తీర్చుకోలేమని ప్రగల్బాలు పలికినటువంటి ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి మూడున్నర సంవత్సరాల కాలంలో మున్సిపల్ ఉద్యోగుల సంక్షేమానికి చేసింది శూన్యమని కొత్తగా ఉద్ధరించింది ఏమీ లేకపోయినా ఉన్న ఉద్యోగుల హక్కులను హరించే విధంగా ప్రభుత్వ పాలన ఉందని అన్నారు.

కార్మిక ఉద్యోగులకు తీవ్ర నష్టదాయకమైనటువంటి రివర్స్ పిఆర్సిని వెంటనే రద్దు చేయాలని, సిపిఎస్ రద్దుచేసి ఓపిఎస్‌ని కొనసా గించాలని ఒకపక్క పెద్ద ఎత్తున ఉద్యమాలు జరుగుతుంటే ఈ రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని పర్మినెంట్ ఉద్యోగులకు పెండింగ్ లో ఉన్న డీ.ఏ ప్రకటించాలి! రెండు సంవత్సరాలుగా పెండింగ్ ఉన్న సరెండర్ లీవులు వెంటనే చెల్లించాల్సి ఉన్నప్పటికీ, గత ఎనిమిది మాసాలుగా వద్ద పెండింగ్‌లో ఉన్న డిఏ ఏరియార్స్ ఫైల్ ను కూడా పరిష్కారం చేయకుండా తీవ్ర కాలియపనా చేస్తూ కార్మికుల యొక్క జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య కార్మికులకు హెల్త్ అలవెన్స్ అని అట్టానంగా ప్రకటించిన ముఖ్యమంత్రి రాష్ట్రమంతా పాలాభిషేకాలు చేయించుకొని ప్రచారం అయిపోయిన తర్వాత చేతులెత్తేసారని ఆరోపించారు ఆఫ్కోస్ ను రద్దుచేసి కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికుల రెగ్యులర్ చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని. మినిమం టైం స్కేలు ఉద్యోగులుగా సేవలు అందిస్తు మరణించిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగ, ఉపాధి అవకాశము కల్పించాలని. క్లాపు ఆటో డ్రైవర్ లందరికీ 18.500 రూపాయలు జీతం ఇవ్వాల్సి ఉన్నప్పటికీ అతి తక్కువ వేతనాలతో వెట్టిచాకిరి చేస్తున్నారని నెలలు తరబడి జీతాలు సక్రమంగా చెల్లించకుండా క్లాప్ డ్రైవర్ల ని వేధింపులు చేయడం ఆపాలని సక్రమంగా కార్మికులందరికీ యూనిఫామ్ చెప్పులు పనిముట్లు అందజేయాలని తదితర డిమాండ్లపై ఈ మహాసభల్లో చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షులు, కాసారపు సత్యనారాయణ. ఆర్గనైజింగ్ కార్యదర్శి. కోలా వాణి ప్రియదర్శిని. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు లింగాల వెంకటేశ్ యూనియన్ నాయకులు సుభాను. అప్పారావ్ టీ. శ్రీను. బంగారయ్య. డోల ప్రసాద్. కాళ్ల రాజు. లీలా ప్రసాద్ బొట్టా వాసు తదితరులు పాల్గొన్నారు.

కింతలిలో 'రాష్ట్రానికి ఇదేం ఖర్మ'

విశాలాంధ్ర - వి.మాడుగుల : మాడుగుల నియోజవర్గం మాడుగుల మండలం కింతలి గ్రామంలో జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన " ఇదేం కర్మ - మా రాష్ట్రానికి, 'రచ్చబండ' కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా అనకాపల్లి పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు, మాడుగుల నియోజవర్గ తెలుగుదేశం పార్టీ ఇంఛార్జ్ పివిజి కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగజగదీశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం వైకాపా ప్రభుత్వం చేస్తున్న పాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ రాష్ట్రంలో ప్రజలు ప్రభుత్వం చేస్తున్న పాలన వల్ల ఇదేం కర్మ నా రాష్ట్రానికి అనే నినాదం అందరి నోట వినిపిస్తుందన్నారు. అనంతరం పివిజి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో ప్రజల వద్దకు వెళ్లి వాళ్ళ యొక్క సమస్యలను తెలుసుకోవాలని ఇదే కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమం ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కింతలి గ్రామంలో రచ్చబండ కార్యక్రమం ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం ప్రారంభించి ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలిసి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడ ప్రజలు రోడ్లు ఎక్కడ చూసినా అద్వానంగా ఉన్నాయని, నిరుఉద్యోగ సమస్య, కరెంట్ బిల్లులు భారీగా పెంచేసారన్నారు. మళ్లీ చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా చేసుకుంటేనే అందరి కష్టాలు తీరుతాయని ముక్త కంఠంతో చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, యూనిట్ ఇంఛార్జ్ మజ్జి బాబ్జీ, సోమన్నదొర, అనకాపల్లి పార్ల మెంటు రైతు సంఘం అధ్యక్షులు గొల్లవిల్లి శ్రీరామ్మూర్తి, మాజీ జెడ్పీటీసీ పోలుపర్తి సత్యవతి, అనకాపల్లి పార్లమెంటు సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు కసిరెడ్డి అప్పలనాయుడు, క్లస్టర్ ఇంఛార్జ్‌లు పేరవు కొండబాబు, పుప్పాల రమేష్, వొమ్మలి సర్పంచ్ సుంకరి సింహా చలం నాయుడు, లెక్కల కాశిబాబు, అప్పాన రమణ, కల్యాణ చక్రవర్తి, జల్లి సూర్య ప్రకాష్ రావు, కొండబాబు, వంతల అప్పారావు, అర్జునరావు, వంశీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.